చురుగ్గా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

- అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద తాడిపత్రి ఎంపిక
- రూ.7.68 కోట్లతో పనులు
- మారనున్న తాడిపత్రి రైల్వే స్టేషన్ రూపురేఖలు


మొదటి ప్లాట్ ఫారం షెడ్డును విస్తరిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద చేపడుతున్న ఆధునికీకరణ పనులతో తాడిపత్రి రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ఈ స్కీం కింద పనుల కోసం రూ.7.68 కోట్లు మంజూరు చేశారు. నాలుగు నెలల క్రితం ఆధునికీకరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. పనులను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. వర్షాలతో తాత్కాలిక అడ్డంకులు ఏర్పడుతున్నా.. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పనులను వచ్చే ఏడాది ఏప్రిల్‌కు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు.

ఊహించని స్థాయిలో..

ఊహించని స్థాయిలో జరుగుతున్న ఆధునికీకరణ పనులతో తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో రూపురేఖలు మారనున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారాన్ని విశాలమైన, చక్కటి వెలుతురుతో సౌకర్యవంతంగా, ఆహ్లాదకరంగా తీర్చి దిద్దనున్నారు. అంతేకాకుండా ప్రయాణ ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ గదులు, ప్రయాణికుల కోసం సమాచార సూచికలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా పార్కింగ్, విశాలమైన పాదచారుల మార్గాల విస్తరణ, మెరుగైన లైటింగ్, రైల్వే ప్రాంగణాన్ని సుందరీకరించనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రెండో ప్రవేశ ద్వారం, మొదటి, రెండో ప్లాట్ ఫారం షెడ్లను విస్తరిస్తున్నారు. ఆధునిక పబ్లిక్ అన్సౌన్స్‌మెంట్ విధానం ప్రవేశ పెట్టనున్నారు. ఎల్‌ఈడీ డిస్‌ప్లేతో స్టేషన్ల పేర్లు కలిగిన బోర్డుల ఏర్పాటు, వెయిటింగ్ హాళ్ల విస్తరణ పనులు, రైలుకు సంబంధించిన బోగీల నెంబర్లు డిస్‌ప్లేలలో కనిపించేలా ఏర్పాటు చేయనున్నారు. మాస్టర్ ప్రణాళిక ప్రకారం దశల వారీగా అభివృద్ధి చేయడం లక్ష్యమని రైల్వే అధికారులు తెలిపారు.

దశ మారనున్న మూడు జిల్లాల సరిహద్దు రైల్వే స్టేషన్

తాడిపత్రి రైల్వే స్టేషన్‌కు రోజూ అనంతపురం, వైఎస్సార్, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి ప్రయాణికులు వస్తుంటారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో భారీ సిమెంట్ పరిశ్రమలు, స్టీల్ ప్లాంట్‌తో పాటు వందలాది గ్రానైట్, కడప స్లాబ్ యూనిట్లు విస్తరించాయి. ఆయా పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. దేశంలోని బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, ఒరిస్సా, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం కార్మికులు వలస వస్తున్నారు. వందల సంఖ్యలో ఉద్యోగులు కూడా ఉపాధి పొందుతున్నారు. వీరందరి రాకపోకలతో తాడిపత్రి రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోతోంది. గ్రానైట్, కడపస్లాబ్ యూనిట్ల యజమానులు కూడా వ్యాపారం కోసం ఆయా రాష్ట్రాలకు వెళుతుంటారు. తాడిపత్రి పరిసర మండలాల నుంచి గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు అరటి ఎగుమతి అవుతోంది. అరటి కొనుగోలు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు తాడిపత్రికి రాకపోకలు కొనసాగిస్తుంటారు. వీరందరికి అనువుగా సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి తాడిపత్రి రైల్వే స్టేషన్ ముస్తాబవుతోంది.


తాడిపత్రి రైల్వే స్టేషన్ ముఖద్వారం


రెండో ప్లాట్‌ఫారంలో విస్తరణ పనులు

డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు


శింగనమలలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సుమన జయంతి


పెద్దపప్పూరులో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శింగనమల: డయేరియా రాకుండా గ్రామ పంచాయతీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ సుమన జయంతి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అనిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డయేరియా ప్రబలకుండా వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. అనిమేటర్లు గ్రామ స్థాయిలో మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి, డయేరియాపై అవగాహన కల్పించాలన్నారు అనంతరం ఆమె పోతురాజుకాల్వ గ్రామంలో పర్యటించారు. ఎంపీడీఓ రమణ, తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్, ఎంఈఓ నరసింహారాజు, సీహెచ్‌ఓ గంగాధర్, ఈఓఆర్‌డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: గ్రామీణ ప్రాంతాల్లో డయేరియా నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ శేషారామ్‌సింగ్, ఎంపీడీఓ గోపీకృష్ణ, క్రిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసులరెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులు 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: యల్లనూరు పీహెచ్‌సీ పరిధిలో జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై మంగళవారం వైద్యులు శివసాయి, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మురుగు కాల్వల్లో అబెట్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, హెల్త్‌అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి, ఏఎన్‌ఎం శ్రీదేవి, ప్రమీల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యాడికి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో మంగళవారం మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం డమేరియా, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కాశెప్ప, ధన లక్ష్మి, హెచ్‌ఎంలు డేనియల్, చిన్నపెద్దన్న, ఏపీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యల్లో బాగంగా మంగళవారం దేవునిఉప్పలపాడు గ్రామంలో వైద్యుడు సురేందర్ రెడ్డి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్ వలి, ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్లోరిన్ మాత్రలను పంపిణీ చేశారు.10లీటర్ల నీటిలో ఒక క్లోరిన్ మాత్ర కలుపుకుని కాసేపటి తరువాత ఆ నీటిని తాగితే డయేరియాకు గురయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయని సూచించారు.

గార్లదిన్నె: విద్యార్థులు డయోరియాపై అప్రమత్తంగా ఉండాలని కనంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో డయోరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజన సమయంలో విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్దార్ వలి, గురుప్రసాద్, ఉమ, పంచాయతీ కార్యదర్శి పవన్‌కు మార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర వ్రతం


వ్రతం నిర్వహిస్తున్న వేద పండితులు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మంగళవారం సంకష్టహర చతుర్ధి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ప్రతిమను శోభాయానంగా అలంకరించారు. వేదపండితులు రామేశ్వర శర్మ, చంద్రా శర్మ, అనిల్ తదితరుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామికి అర్చన, అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

రాజరాజేశ్వరికి పూజలు



బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన రాజ రాజేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ


తాడిపత్రి: మొక్కలు నాటేందుకు సిద్ధమైన అధ్యాపకులు, విద్యార్థులు


గుత్తి: విద్యార్థులతో కలసి మొక్క నాటుతున్న కమిషనర్ శ్రీనివాసులు

తాడిపత్రి: మొక్కల పెంపకంతోనే భవిష్యత్తులో మానవ మనుగడ సాధ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏపీ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మొక్కలను నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా గుర్తించాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీధర్‌రెడ్డి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో కలసి కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు.

గుత్తి: స్థానిక జంగాల కాలనీలోని పాఠశాల ఆవరణలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో కనీసం రెండు మొక్కలైనా నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాములమ్మ హారతి ఉత్సవం

పామిడి: పట్టణంలోని కొండూరురోడ్డులో ఉన్న రాములమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి వార్షిక హారతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని శోభాయానంగా అలంకరించారు. భక్తులు భక్తిప్రపత్తులతో అమ్మవారిని దర్శించుకొని తరించారు. ఈ సందర్భంగా భావసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేక అర్చనలు చేశారు. పిండివంటలు సమర్పించి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో సమాజ్ సభ్యులు సురేష్‌రావు, రమేష్‌రావు, జీ రాజశేఖర్ రావు, కింగ్‌కాంగ్‌రావు, పూజారి నాగరాజు, రాజు రావు తదితరులు పాల్గొన్నారు.

అతిసారం నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీరాం కుమార్

యాడికి: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నీటి నిల్వలతో ఉధృత అతిసారం ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యులు శ్రీరాం కుమార్, పరమేశ్వర్, దేవరాజన్. అప్పయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి సూచించారు. మంగళవారం ఆయా పీహెచ్‌సీలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు అతిసారం బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ పాకెట్లు, జింక్ పాకెట్లు పంపిణీతో పాటు తాగునీటి వనరులు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించడం, స్కూల్ పిల్లల్లో భోజనానికి ముందు చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కాచి చల్లార్చిన తర్వాతనే నీరు తాగాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'రోటరీ' సేవలను విస్తృతం చేస్తాం


మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు శివానంద

గుంతకల్లుటౌన్: నిరుపేద పిల్లల విద్యాభివృద్ధి, ఉచిత వైద్యశిబిరాల నిర్వహణతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడమే లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివానంద, డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ రొటేరియన్‌లు శిరీష్, శ్రీకాంత్ రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్‌క్లబ్ నూతన కార్యవర్గాల్ని ప్రకటించారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా శివానంద, శ్రీనివాసులు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా అర్చన కార్వా, కార్యదర్శిగా సునీతను నియమించినట్లు వారు తెలిపారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు రోటరీక్లబ్ ఆడిటోరియంలో నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు రేణుక, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యా కిట్ల పంపిణీ

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి, ధర్మాపురం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు కిట్లను ధర్మాపురంలో సర్పంచ్ మక్కెల చంద్ర, హెచ్‌ఎం వైవీ ప్రసాద్, ఉపాధ్యాయులు రామచంద్రుడు, శంకరయ్య అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

గుత్తి రూరల్: రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భారతి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రేషన్ బియ్యం కొలతల్లో తేడా లేకుండా కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. జూలై 1 నుంచి కార్డుదారులకు ప్రభుత్వం కంది బేడలు, పంచదార, రాగులు పంపిణీ చేయనుందన్నారు. ప్రతి డీలరు నిర్ణీత సమయానికి డీడీలు చెల్లించి స్టాక్ పాయింట్ నుంచి బియ్యం తరలించాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సూర్యనారాయణ, డీలర్లు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ చేయాలి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.20 వేల పెట్టుబడి సాయం నగదును వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. నాయకులు దాసరి శ్రీనివాసులు, బి. శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆయకట్టు కింద సాగు చేసిన మిరప తదితర పంటలు కూడా నీరందక నష్టపోవడంతో అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఖరీఫ్ పంట సాగుకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా వెంటనే రైతుల ఖాతాల్లో రూ.20 వేలు పెట్టుబడి సాయం నగదును జమచేసి ఆదుకోవాలని కోరారు. అలాగే ఖరీఫ్ రబీ పంటల బీమా ప్రకటించాలని, కరువు నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

బైక్‌ను ఢీ కొన్న ఆటో– ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో కృష్ణయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మామిళ్లపల్లికి చెందిన కృష్ణయ్య తన స్నేహితునితో కలసి బైక్‌లో గాంధీ సర్కిల్ వైపు వెళ్తుండగా సినిమా థియేటర్ వద్ద వెనుక నుంచి ఆటో బైక్‌ను ఢీ కొనింది. ప్రమాదంలో కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణయ్య స్నేహితుడు ఆటో డ్రైవర్‌ను చితకబాదాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్టార్టర్ చోరీ

గార్లదిన్నె: మండల కేంద్రంలో మంచి నీటి బోరుకు సంబంధించిన విద్యుత్ స్టార్టర్ మంగళవారం చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు నీరందించే బోరుకు సంబంధించిన స్టార్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పంచాయతీ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దుండగులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా నీరు లేక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.

క్లుప్తంగా

నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు


ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్ : నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులపై చర్యలు తప్పవని అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి హెచ్చరించారు. మంగళవారం ఆమె పట్టణంలోని కోరమాండల్, భీమలింగ ఫర్టిలైజర్స్, మల్లికార్జున ఫర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీ చేశారు. కంది, ఆముదం విత్తనాలతో బిల్లులను, రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణదారులు అవకతవకలకు పాల్పడినా, నకిలీ, నాణ్యత లేని విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కాన్వెంట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు


గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కాన్వెంట్‌కు దీటుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను జాయిన్ చేయాలని సీడీపీఓ డిల్లీశ్వరి సూచించారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆరుగురు పిల్లలను ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో జాయిన్ చేశారు. ఈసందర్భంగా గ్యాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పావతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని జెండా కట్ట, చెంబుల బావి కాలనీలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల్లోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. సమయ పాలన పాటించాలని, విధులను సక్రమంగా నిర్వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నసీమా, జహ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీపీఐ నాయకుడి మృతి


అబ్దుల్ వహాబ్ (ఫైల్)

గుంతకల్లు: సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ వహాబ్ (69) మంగళవారం మృతి చెందాడు. స్థానిక హనుమేష్ నగర్‌లోని రోటరీ హైస్కూల్ సమపంలో ఉంటున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండేవాడు. మంగళవారం సాయంత్రం ఆయన ఇంట్లోనే మృతి చెందాడు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు మహేష్, గోపీనాథ్ ఎంఎండీ గౌస్ తదితరులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహిళలపై దాడులను అరికట్టాలి


మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు సావిత్రి

గుంతకల్లుటౌన్: దేశవ్యాప్తంగా మహిళలపై హెచ్చుమీరిన దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై హింస, హత్య, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. మహిళల కేసులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి జిల్లాకు ఒక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ, సభ్యులు ఆదిలక్ష్మి, శాంతమ్మ, సుశీల, సుగుణ, ఉషా, లక్ష్మి, గంగ తదితరులు పాల్గొన్నారు.

నేడు అత్యవసర కౌన్సిల్ మీట్

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అత్యవసరంగా కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేశామని కమిషనర్ రామ్మోహన్ తెలిపారు. సమావేశానికి ఆయా పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు హాజరు కావాలని కోరారు. కాగా ఇటీవల ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణల్లో పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో కొందరు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు పరారీలో ఉండగా మరికొందరు కడప జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో మీటింగ్‌కు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఐకి చెందిన మహిళా కౌన్సిలర్లు మాత్రమే హాజరు కానున్నట్లు తెలుస్తోంది. కేసులు లేని మున్సిపల్ వైస్ చైర్మన్లు సరస్వతమ్మ, అబ్దుల్ రహీంలలో ఒకరు కౌన్సిల్ మీట్ నిర్వహించనున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిల్, కో ఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పాఠ్యపుస్తకాల గది సీజ్

గుంతకల్లు రూరల్: పట్టణంలోని విజ్ఞాన్ జ్యోతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు విక్రయిస్తుండటంతో ఎంఈఓ మస్తాన్ రావు మంగళవారం పాఠ్య పుస్తకాలు ఉంచిన గదిని సీజ్ చేశారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వెంటనే వారు ఎంఈఓకు సమాచారం అందించారు. ఆయన అక్కడకు చేరుకుని గదిని సీజ్ చేశారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

గుత్తి రూరల్: పట్టణంలో విద్యార్థుల తల్లిదండ్రులతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చిన్న, ఉపాధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అదనపు తరగతుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అలీ, నరశింహ, సునీల్, మనోహర్, రాము, దేవా పాల్గొన్నారు.

అందరికీ ప్రభువు 'క్రీస్తు'

పామిడి: అందరికీ ప్రభువు క్రీస్తు అని గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్, దైవజనులు కే నెహమ్యా అన్నారు. స్థానిక శాశ్వత కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అందరికీ రక్షణ శుభవార్త సభలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయియి. ఈసభలకు ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేసిన ఆయన క్రైస్తవ విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏసే సత్యం, జీవం, మార్గం అన్నారు ఈసందర్భంగా సింగింగ్ క్వయర్ టీమ్ ఆలపించిన భక్తి సంకీర్తనాలాపనలు పరవశింపజేశాయి. కార్యక్రమంలో శాశ్వత కృపా మినిస్ట్రీస్ నిర్వాహకులు పీటర్ విజయ్, విజయ్ ఛార్లెస్, ప్రభాకర్ ఛార్లెస్, లూకా పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి సన్మానం


సింగరి శ్రీరంగయ్యను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి: దేశంలో ఎమర్జెన్సీ సమయంలో వ్యతిరేకంగా పోరాడిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను సన్మానించాలన్న ఆ పార్టీ పిలుపు మేరకు మంగళవారం తాడిపత్రిలో సీనియర్ నాయకుడు సింగరి శ్రీరంగయ్యను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిందన్నారు. తద్వారా ప్రజాస్వామ్యంలో ఉన్న అనేక మంది ప్రజల గొంతుకలను నొక్కారన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన అనేక మంది దేశభక్తులు, రాజకీయ నాయకులను జైల్లో వేశారన్నారు. కానీ జనసంఘ్ పార్టీ అన్ని రాజకీయ పార్టీలతో కలసి ఎమర్జెన్సీపై తీవ్రంగా ప్రజా ఉద్యమాన్ని కొనసాగించిదని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, తాడిపత్రి నియోజకవర్గం కన్వీనర్ రంగనాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మైదుకూరు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846